# లంచగొండి ★

రచన :
... " కోమటి " ...

ప్రజలంతా తిట్టినవారేగాని తిట్టనివారులేరు. నల్గురు అన్నమాట పదిమంది యంటారు. నిజమెంతో తెలుసుకోరుగదా. "ఆడిపాపం పండిందిరా. నూరుశవాలు తిన్న రాబందు ఒక గాలిపెట్టుకు పోతుందిరా. ఎంతమంది సంసారాలు దోచుకొన్నాడు రా" అని లోకులు పలువిధములుగా దుమారము యెత్తి పోస్తున్నారు చంద్రశేఖర్ పైకి.

చంద్రశేఖర్ డిస్ట్రిక్టు కమర్షియల్ ఆఫీసులో పెద్ద గుమస్తా. ఇతర పెద్దగుమాస్తాల వలె పలుమార్లు త్రిప్పించికొనక, మోసము చేయక తప్పకుండా ఉపాధి కల్పిస్తున్నాడు. నేటి భారతావనిలో సగానికిపైగా పెద్దపెద్ద పట్టాలుపొంది కడకు రోజుకొకరూపాయియైన సంపాదనలేక తిరుగుచున్నారు. అటువంటి వారికి చంద్రశేఖర్ అండగా నిలిచాడంటే మిగతావారికి యెందుకో యేడుపు. అమ్మా పెట్టాపెట్టదు, అడుక్కుతినానివ్వదు అన్నట్లు మన భారతీయులకు అందులో ఆంధ్రులకు పరిపాటి అయినది.

పెద్దపెద్ద లాయర్లంతా చంద్రశేఖర్‌తో రాయబారముచేయ మొదలిడినారు నీకేసు గెలుపొందచేస్తామని గాని చంద్రశేఖర్ ఒప్పుకొనలేదు. తానుచేసినపనికి తనే జవాబుదారి.

కోర్టులో హాజరయిన చంద్రశేఖరానికి సమాధానమిమ్మన్నాడు న్యాయాధికారి.

చంద్రశేఖర్ అన్నాడు. "నేను లంచాలు తీసుకొన్నమాట వాస్తవమె. తీసుకొన్నవారికి మోసముచేయలేదని ఘంటాపథముగ చెప్పగలను. అయితే నా బి. ఏ. డిగ్రీ నాకు ఉద్యోగ మిప్పించలేకపోయింది. పెద్దపెద్ద ఉద్యోగస్థులైన బంధుగులు కూడ నాకు ఉద్యోగ మిప్పించలేకపోయినారు. గాని నాకు ఉద్యోగమిప్పించింది ఒక్క లంచమె. రెండువేల రూపాయలు. మరియు నాకు నలుగురుకుమార్లు. అందులో యిద్దరికి ఉద్యోగము సంపాదించింది ఒక్క లంచమె. ఇంక నాకు ప్రమోషనులపై ప్రమోషను లిప్పించి కడకు యీ పెద్దగుమస్తాగిరి యిప్పించగల్గింది ఒక్క లంచమె. ఇపుడు నాకు ఆరుగురు ఆడపిల్లలున్నారు. నేటి కాలంలో కట్నాలు యిస్తే గాని పిల్లలు చలామణి కాకున్నారు. బి. ఏ. చదివినవాడికి కట్నమె. మెట్రిక్ చదివినవాడికి కట్నమె. చదువు లేనివాడికి కట్నమె. ఉద్యోగమున్నవాడికి కట్నమె. ఉద్యోగము లేనివాడికి కట్నమె. ఇప్పటికి పాడువేల రూపాయలు చొప్పున కట్నమిచ్చి నల్గురు ఆడపిల్లలకు పెండ్లిచేసితిని. కట్నమొక్కటియెగాక లాంఛనాలు సారి మెందలైనవి. ఇంకా నాకు ఇద్దరు కుమార్లు ఉద్యోగాలకు, ఇద్దరు ఆడపిల్లలు పెండ్లికి యున్నారు. ఇది నాచరిత్ర. ఆడపిల్లలు ఎక్కువయున్న మహానుభావులకు నా అవస్థ అర్థమవుతుంది.

నేను లంచాలు తీసుకొన్నమాట వాస్తవమె. లంచాలు తీసుకొన్నవారికి మోసము చేయలేదనుట నిక్కము. లంచముగా తీసుకొన్నడబ్బు యింట్లో మూటగట్టుకొన్నాడన్న ప్రజలమాట అసంభవం. పరులసొమ్ము పరులపాలు అన్నట్లు యెవరిదగ్గరనైతే లంచమని పేరున తీసుకున్నానో ఆ డబ్బునే కట్నమన్న పేరుతో పరులకు సమర్పించేను.

నూరు రూపాయలు సంపాదించుచున్న రైల్వేయుద్యోగి ఆ డబ్బుతో, ఈ కరువు కాలములో సంసారాన్ని నడుపుతాడా, లేక పిల్లచదువులకై ఖర్చుపెట్టుతాడా లేక ఆడపిల్లల కట్నాలుకై పోస్తాడా? తన జీవితాంతమువరకు ఖర్చులుపోను కూడబెట్టిన డబ్బుతో ఒకటి యిద్దరు ఆడపిల్లలకు పెండ్లిచేయగలడు గాని నలుగురైదుగురు కల్గిన ముష్టి యెత్తుకోవలసినదే.

రైల్వేఉద్యోగస్థుల సంతతికితగిన వయస్సుకుతగిన చదువుండదన్న సంగతి రైల్వేలోనున్న ఉద్యోగస్థులందరకు తెలుసు. పై అధికారుల చిత్తమువచ్చినట్లు బదిలీచేయడం, వెళ్ళినచోట్ల తగిన పాఠశాలలు లేకపోవడం, పోనీ పెద్దపట్టణాల్లోయుంచి చదివించవలెనంటే వారికి తగినదక్షత శిక్షణ కావలసిన డబ్బు లేకపోవడమువల్ల, పిల్లలకు కావలసిన చదువులు సాగకపోవుచున్నవి. డిగ్రీలు లేకపోతే ఉద్యోగాలు దొరకవు. పైగా రైల్వేవారికియున్న సదుపాయము యేమిటంటే రైల్వే ఉద్యోగస్థుల పిల్లలకు విధిగా నౌఖరి యివ్వాలన్న సూత్రము. అది కూడ నేడు తొలగిపోయినది. దానికంతా సర్వీస్ కమిషను — దానికి కావలసిన యోగ్యతలు యుంటేనే దొరుకుచున్నవి. ఆ యోగ్యతలు లేనివారికి లంచాలు ఒక పెద్ద దైవసహాయము.

ఇంక నాదగ్గరనున్న నిల్వ కొద్దిమాత్రమె. ప్రభుత్వము తనిఖికూడ చేయించినది. ఇపుడు యింటిలో యెంత డబ్బు ఉన్నదో ప్రభుత్వానికి తెలుసు. నాపైని గిట్టనివారు చెప్పియుంటారు. ఐనా వారి అభిప్రాయముకూడ నిజమైనది. ఇందుకు నేను యెట్టి లాయర్ల సలహా పొందలేదు. నేనుచేసిన కర్మకు నేనే కర్తను. అటుపైని న్యాయమూర్తుల యిష్టము అని చంద్రశేఖరు మూరుకొనెను.

చంద్రశేఖర్ వాఙ్మూలము విన్నవారు చాల విచారించేరు. చెడ్డవాడు, లంచగొండి అన్ననోరె మంచివాడు నిరుద్యోగులకు మిత్రుడు అని అన్నది. అతనుండబట్టియె కొంతమందికైన ఉద్యోగములు దొరికినవనియు, అటువంటివానిపై గిట్టక చెప్పినవారిని దూషించేరు. లోకులు కాకులుకదా.

ఐతే చట్టము ఒప్పుకుంటుందా? చట్టము చట్టమే. పెద్ద గుమాస్తా స్థానమునుండి తప్పించి మరొకజిల్లాకు సామాన్యగుమస్తాగా బదిలీ చేయబడెను.